క్లుప్తంగా

8, 9 తేదీల్లో ఒంగోలు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

ఒంగోలు: ఒంగోలు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలను ఈ నెల 8, 9 తేదీల్లో స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఒంగోలు మండల కో ఆర్డినేటర్ సోమినేని సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చదరంగం పోటీలు జరుగుతాయన్నారు. 9వ తేదీ అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. 2012 తర్వాత జన్మించిన బాలబాలికలు అండర్-14 విభాగం, 2009 తర్వాత జన్మించిన వారు అండర్-17 విభాగంలో పోటీపడేందుకు అర్హులని తెలిపారు. ఒంగోలు మండల పరిధిలోని అన్ని గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనేందుకు పాఠశాలల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 98494 29839ను సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకున్న సుబ్బరత్నం

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ కడియం సుబ్బరత్నం కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా సోమవారం స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీమకుర్తి మున్సిపాలిటీలో శానిటేషన్ విభాగంలో అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు సుబ్బరత్నం ఎంపికయ్యారు. మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యతో కలిసి సుబ్బరత్నం అవార్డు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన నంగనం రామకృష్ణ(44) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం రాత్రి 10.30 సమయంలో గుంటూరు నుంచి ఒంగోలు బైక్‌పై వెళ్తున్న క్రమంలో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని కుప్పగంజి వాగు సమీపంలో ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను స్థానికులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్చరీ పోటీలకు దోర్నాల విద్యార్థి ఎంపిక



క్రీడాకారుడు నాగరాజుతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూమని నాగరాజు జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్‌ప్రసన్నతాంజలి హర్షం వ్యక్తం చేశారు. గత నెల 15వ తేదీన ఒంగోలు ఏబీఎం క్రీడా ప్రాంగణంలో జరిగిన విలువిద్య పోటీల్లో నాగరాజు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో ఈ నెల 10,11,12వ తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై వ్యాయామ ఉపాధ్యాయుడు రామానాయక్, ఉపాధ్యాయులు హెచ్.రామానాయక్, విజయమాణ్యిం, నాగమూర్తి, అనసూయ, రహమత్, శివ, అబ్దుల్ సలాం, పోలయ్య, మీతేనాయక్, మహబూబీ, మహాదేవి, అనిత, సయ్యద్ నాయబ్‌రసూల్, నరేష్, కార్తీక్ అభినందనలు తెలిపారు.

లాయర్ రాకేష్ కిషోర్ పట్టా రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంజయ్య, నాయకులు

తాళ్లూరు: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరేసి దాడి చేసేందుకు ప్రయత్నించిన లాయర్ రాకేష్ కిషోర్‌ను వెంటనే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి శాశ్వతంగా డీబార్ చేసి ఆయన న్యాయవాద పట్టాను రద్దు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం తాళ్లూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్ గవాయ్‌ను అవమానించిన లాయర్‌పై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గౌరవ సభల్లో ఇలాంటివి తలెత్తడం సిగ్గుచేటని మండిపడ్డారు. దేశ ప్రధాని వెంటనే స్పందించి విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరారు.

నిరుపయోగంగా నూతన భవనం..!

పాడుబడిన పాత భవనం..

- ఇదీ..దొడ్డవరప్పాడు పశువైద్యశాల భవనం దుస్థితి
- నూతన భవనం పనులు 2024లోనే 95 శాతం పూర్తయినప్పటికీ పట్టించుకోని కూటమి ప్రభుత్వం



నిరుపయోగంగా ఉన్న దొడ్డవరప్పాడు పశువైద్యశాల నూతన భవనం

మద్దిపాడు: కూటమి ప్రభుత్వంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మద్దిపాడు మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామంలో పశువైద్యశాల భవనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పశువైద్యశాల నిర్వహిస్తున్న పాత భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతుండటంతో పశుసంవర్ధక శాఖ వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దినదిన గండం అన్నట్టుగా పరిస్థితి ఉండటంతో ప్రాణాలు అరచేత పట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. చాలా కాలం క్రితమే వైద్యశాల భవనం పాడుబడిపోవడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.50 లక్షలకుపైగా నిధులు కేటాయించి నూతన భవన నిర్మాణం చేపట్టారు. 2024వ సంవత్సరంలోనే 95 శాతానికిపైగా పనులు కూడా పూర్తి చేశారు. చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డవరప్పాడు పశువైద్యశాల నూతన భవనానికి గ్రహణం పట్టింది. తుది మెరుగులు దిద్ది నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో సదరు కాంట్రాక్టర్ మిగిలిన పనులను నిలిపివేశాడు. దీంతో సుమారు ఒకటిన్నర సంవత్సరం నుంచి పనులు నిలిచిపోయి నూతన భవనం నిరుపయోగంగా మారింది. ఆలనాపాలనా లేకపోవడంతో నూతన భవనం కూడా రోజురోజుకూ పాడైపోతోంది. భవనం ముందు, లోపలివైపు పిచ్చిమొక్కలు మొలిచాయి. విషకీటకాలకు నిలయంగా మారింది. వాస్తవానికి పశువైద్యశాఖ మద్దిపాడు ఏడీ కార్యాలయం నుంచి దొడ్డవరప్పాడు పశువైద్యశాల నూతన భవనం నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరిగాయి. కానీ, బిల్లులు ఎందుకు పెండింగ్‌లో పడ్డాయో ఉన్నతాధికారులకే తెలియాల్సి ఉంది. ఏదిఏమైనప్పటికీ పాత భవనం పాడైపోవడం, నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వాడుకలోకి తీసుకురాకపోవడంతో దొడ్డవరప్పాడు పశువైద్యశాలకు భవనం సమస్య తలెత్తి పశుపోషకులకు మెరుగైన సేవలు అందించలేకపోతోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పాలకులు, ఉన్నాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయించి పెండింగ్ పనులు పూర్తి చేయించి పశువైద్యశాలకు నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెస్ క్రీడాకారిణికి ఆర్థిక సహాయం



చెస్ క్రీడాకారినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఒంగోలు పీవీఆర్ గరల్స్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న చెస్ క్రీడాకారిణి ఆముక్త మాల్యదకు సోమవారం ఆర్థికసాయం అందించారు. 13 సంవత్సరాల విభాగంలో చెస్‌లో దేశంలోనే మొదటి స్థానంలో, ప్రపంచంలో ఏడో స్థానంలో నిలిచి హంగేరీలో ఈ నెల 14 నుంచి నవంబర్ 26వ తేదీ వరకు నిర్వహించనున్న చెస్ వరల్డ్ టోర్నమెంట్లో ఆడేందుకు వెళ్తున్న సందర్భంగా రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పార్థసారథి, సెక్రటరీ స్వామి, కోశాధికారి నందకుమార్, క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, పూర్వ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, పల్లపు సుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ మిరియాల కృష్ణమూర్తి, రాచమల్లు గోపి కిషోర్, సహాయ కార్యదర్శి బియ్యపు విజయ్ కుమార్, తుమ్మపూడి పాండురంగారావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి నిర్వహించాలి

ఒంగోలు మెట్రో: ప్రపంచంలోనే తొలి కావ్యం శ్రీమద్రామాయణాన్ని అనుగ్రహించిన వాల్మీకి మహాముని జయంతిని మంగళవారం దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని, జిల్లాలోనూ నిర్వహించాలని జ్ఞాన సింధు ధార్మిక మండలి వ్యవస్థాపకులు పరమాత్ముని రామచంద్రమూర్తి, ఆధ్యాత్మిక వేత్త నెమ్మాని సీతారామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఆధ్యాత్మిక హిందూ సంస్థలు, దేవాలయాల నిర్వాహకులు కూడా వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. నేటి తరానికి రామాయణం గొప్పదనం, అందులోని నీతి సిద్ధాంతాలను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: అనారోగ్యంతో బాధపడుతున్న వెల్లంపల్లి నారాయణకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలో పోస్టాఫీస్ బజార్‌లో నివాసం ఉంటున్న నారాయణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డితో సాయం అందించారు. బూచేపల్లికి బాధితుడు నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడు అన్నవరపు రవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జంకె ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో జంకె దంపతులు

పెద్దదోర్నాల: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి దంపతులు సోమవారం మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలంలో దైవదర్శనం ముగించుకున్న ఆయన మార్కాపురం వెళ్తూ మార్గమధ్యంలోని పెద్దదోర్నాలలో ఆగారు. ఈ సందర్భంగా షిర్డీసాయి బాబా ఆలయ కమిటీ సభ్యులు జంకె దంపతులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభుదాస్

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్ హాజరై మాట్లాడుతూ దేశంలో అంతకు ముందు ఉన్న అనేక పరోక్ష పన్నుల స్థానంలో కొత్తరకం పన్నును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. ఒకే దేశం ఒకే పన్ను విధానంతో దేశమంతా స్వేచ్ఛగా, వస్తు సేవలు పెరుగుతున్నాయన్నారు. పన్నుల విధానంలో, పారదర్శకత పన్నుల ఎగవేతను అరికట్టడం, లంచగొండితనం నివారణ అనే పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, సీహెచ్ ప్రవీణ, గంథం వేణు, ఏ.నగేష్, కె.రవీంద్ర, జి.రమేష్, ఎం.రామచంద్రయ్య, టి.వెంకటేశ్వర్లు, సారీలమ్మ, జి. రమేష్‌బాబు, వైవీ రమణ పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించడం అభినందనీయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డీఎం శంకర్

దర్శి:

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్టీసీ డీఎం శంకర్ అన్నారు. హబీబుల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 లీటర్ల కెపాసిటీ గల తాగునీటి ట్యాంక్‌ను సోమవారం శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పాదిలికి చెందిన హబీబుల్లా కరీముల్లాబేగ్, మీరా బేగ్‌లు వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రయాణికుల దాహార్తి తీర్చే విధంగా శుద్ధజలాన్ని అందించాలనే కృత నిశ్చయంతో దీన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పుల్లలచెరువు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్.రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. చిత్తూరు జిల్లా దేవళంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ అంబేడ్కర్.. అని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించకుంటే దళిత సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రాములు హెచ్చరించారు. వి.వెంకటేశ్వర్లు, గురువయ్య, మరియదాసు, నాగేషు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమ్మెను పరిష్కరించాలి

- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
- సమ్మె కాలంలో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి
- మీ కోసం కార్యక్రమంలో సీఐటీయూ నాయకుల వినతి



మీ కోసంలో జేసీ గోపాల కృష్ణకు గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె విషయాన్ని వివరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు సబర్బన్: గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమ్మెను ప్రభుత్వం జోక్యం చేసుకుని నివారించాలని ప్రకాశం జిల్లా గ్రానైట్ కటింగ్ అండ్ పాలి షింగ్ యూనిట్ (సీఐటీయూ) యూనియన్ నాయకులు మీ కోసం కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ పీ.రాజా బాబు ఆధ్వర్యంలో మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సమ్మె మూలంగా పనులు కోల్పోతున్న కార్మిక వర్గాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జేసీ ఆర్.గోపాల కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ రాయల్టీ వసూళ్ల ప్రైవేట్ ఏఎంఆర్ సంస్థకు లీజుకు ఇచ్చిందన్నారు. గతంలో బ్లేడుకు రూ.27 వేలు చార్జీ ఉంటే దానిని రూ.35 వేలకు పెంచిందన్నారు. లీజు పొందిన సంస్థ అదనంగా వసూళ్లకు పూనుకుంటున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమానులు అక్టోబర్ 1 నుంచి సమ్మెలోకి వెళ్లి ఫ్యాక్టరీలు బంద్ చేశారని చెప్పారు. కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమ్మెను నివారించాలని కోరుతున్నామన్నారు.

500 ఎకరాల సాగు, తాగునీటి చెరువు కలుషితం

ఒంగోలు నగరం 18వ డివిజన్‌లోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గ్రామం మొత్తం డ్రైనేజ్ డిశ్చార్జ్‌ని సుమారు 500 ఎకరాల సాగు, తాగు నీటి పెళ్లూరు చెరువుకు డ్రైనేజ్ వ్యర్థాలను చెరువుకు కలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూసపాటి సమర సింహారెడ్డి(జాలిరెడ్డి) కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో కాంక్రీట్ వర్క్ మొదలు పెట్టారని, ఈ విషయమై గ్రీవెన్స్ సెల్‌లో అర్జీ కూడా ఇచ్చామన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు కావాలని దురుద్దేశంతో 500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్న పెళ్లూరు చెరువుకు డ్రైనేజ్ డిస్పోజల్ చేస్తున్నారని చెప్పారు. దీని వలన నీరు ప్రజలు, పశువులు అనారోగ్యం పాలవుతారన్నారు. డ్రైనేజీని పెళ్లూరు సాగు నీటి చెరువుకు కాకుండా ఇసుక వాగులో గుండా ఊరచెరువుకు మళ్లించేలా ఒంగోలు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించాలని ఆ అర్జీలో వేడుకున్నారు.

సమాచార హక్కు చట్టాన్ని

సక్రమంగా అమలు చేయాలి



గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అమృతపాణి, తదితరులు

కొత్తపట్నం: సమాచార హక్కు చట్టం వచ్చి నేటికి ఇరవై సంవత్సరాలు అయినప్పటికీ అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదని రాష్ట్ర సామాజిక సవోద్యమ వేదిక కార్యదర్శి జి.అమృతపాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా.. కొత్తపట్నం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో అమృతపాణి, మరికొంత మంది కలిసి సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ శాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమృతపాణి మాట్లాడుతూ అన్ని కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అందులో అధికారుల పేర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కోరారు. సమాచార హక్కు చట్టం కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఉన్న ఏకైక ఆయుధం సమాచార హక్కు చట్టమని, ప్రతిఒక్కరూ ఈ చట్టాన్ని ఉపయోగించుకుని అవినీతి అధికారులకు బుద్ధి చెప్పే విధంగా చైతన్యవంతులు కావాలని కోరారు. గ్రామాల్లో చేపట్టే పనులు, వాటికి సంబంధించిన రికార్డులను ఈ చట్టం ద్వారా పొందాలని, ఈ చట్టానికి అందరూ సమానులేనని తెలిపారు. ప్రభుత్వ అధికారుల తప్పులను ప్రజలు నిలదీసే అధికారం ఈ చట్టం కల్పిస్తుందన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మేడికొండ రంగయ్య, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్ట్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న విజయ్‌కుమార్, గ్రామస్తులు

కొత్తపట్నం: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంకోట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడంపై కొత్తపట్నం మండలంలోని సంకువారిగుంట సొసైటీ సభ్యులు, గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సంకువారిగుంటలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు దుగ్గిరాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టడం అంటే భారత రాజ్యాంగాన్ని తగలబెట్టడమే అని మండిపడ్డారు. ఎవరైతే తగలబెట్టారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందు ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ టి.కొండలరావు, ఆటో యూనియన్ నాయకుడు ఎస్.చిన్న కోటేశ్వరరావు, పిల్లి బాబూరావు, బాలకోటయ్య, చెక్కా సురేంద్ర, మాజీ సర్పంచ్ డి.హైమావతి, చిటితోటి కోమలి, సుజాత, అన్నవరపు శ్యామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయంలోకి భారీగా వరద నీరు



వరద నీటితో నిండిన శివాలయ ఆవరణ

సంతనూతలపాడు: ఒకవైపు భారీ వర్షం, మరోవైపు సంతనూతలపాడు పెద్ద చెరువు అలుగు ప్రవాహంతో స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం) ముందువైపున్న వంతెన తూములు బ్లాక్ అయి ఆలయంలోకి వర్షం నీరు చేరింది. ఆలయం ముందువైపున్న కాలువ ద్వారా శివాలయంలోకి, గర్భగుడి లోపలికి వర్షం నీరు ప్రవేశించింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి సంతనూతలపాడులోని పెద్ద చెరువుకు వర్షం నీరు చేరి అలుగు ప్రవహించింది. దీంతో వర్షం నీరు శివాలయం ముందు వైపు నుంచి వంతెన మీదుగా మండలంలోని ఎండ్లూరు చెరువుకు చేరింది. అయితే, వంతెన తూములు చెత్తాచెదారంతో నిండిపోవడంతో వర్షం నీరు దిగువకు పోకుండా శివాలయం ముందు వైపున్న కాలువ నుంచి ఆలయంలోకి ప్రవేశించింది. సోమవారం ఉదయం ఆలయ అర్చకుడు ఎస్.బుజ్జి బాబుశర్మ పూజా కార్యక్రమాల కోసం ఆలయ తలుపులు తీయగా శివాలయం ఆవరణతో పాటు గర్భగుడిలోకి వర్షం నీరు చేరి ఉంది. ఎండోమెంట్ ఈవో ఎస్.నారాయణరెడ్డికి ఫోన్ చేసి అర్చకుడు సమాచారం తెలియజేయడంతో ఈవో ఆదేశాల మేరకు అర్చకుడు, ఆలయ చైర్మన్ శిఖాకొల్లి ఉమామహేశ్వరరావు, ఎండోమెంట్ ఉద్యోగి పి.రవీంద్రబాబు, కమిటీ సభ్యులు జేసీబీ ద్వారా శివాలయం ముందు వైపున్న వంతెన తూముల్లో పూడిక తొలగించారు. దీంతో వరద నీరు వెళ్లిపోయి శివాలయంలోకి చేరిన నీరు కూడా బయటకు వెళ్లింది. అనంతరం ఆలయంలో యథావిధిగా పూజలు నిర్వహించారు.

ఈ మలుపు..ప్రమాదానికి పిలుపు!



అర్ధచంద్రాకారంలో ఉన్న తారు రోడ్డు

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదుట అర్ధ చంద్రాకారంగా ఉన్న తారు రోడ్డు మలుపు ప్రమాదానికి పిలుపుగా మారింది. ఈ రోడ్డు నుంచి నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. సంవత్సరం క్రితం అయ్యప్ప మాల వేసుకున్న 10వ తరగతి విద్యార్థి ప్రమాదానికి గురై మృతి చెందాడు. అంతేకాకుండా వద్దిపాడు గ్రామానికి చెందిన ఒకరు, ఇండ్లచెరువు గ్రామానికి చెందిన మరొకరు, కొనకనమెట్ల గ్రామానికి చెందిన ఇంకొకరు ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డారు. స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. నిత్యం కేజీబీవీ పాఠశాలకు విద్యార్థినుల కోసం తల్లిదండ్రులు వచ్చి వెళ్తుంటారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పీడు బ్రేకర్లు నిర్మించి ప్రమాదాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.